**భో**జనాలయి భర్త పిల్లలు హాల్లోకి వెళ్లిపోయాక పెరటి తలుపు తీసింది సునీత.

పెరట్లో నల్లా క్రింద ఉన్న బకెట్టులోని బట్టల్ని పిండి ఆరేస్తోంది పనిమనిషి లచ్చి.

"ఏమే యింకా యింటికెళ్ళలేదా! పండుగపూట నువ్విక్కడే కూర్చుంటే అక్కడ మీ ఆయనేం తింటాడు పాపం! సర్సరే, తొందరగా ఆ పని పూర్తి చేసిరా! ప్రసాదమూ, నాలుగు ఉండ్రాళ్ళూ యిస్తాను పట్టుకెళ్దువుగాని!.." అని

# "అసంతృప్తి ప్రమదలు"

కొత్తపల్లి ఉదయబాబు



"ప్రక్కవాటా రమాదేవి వదినగార్కి యింకా పూజ అయినట్టులేదే!" అనుకుంది తనలో తాను గొణుక్కున్నట్టుగా.

"అవునమ్మా! ఆ అయ్‌గారు బయట్నుంచి యిప్పుడే పూజా సామగ్రి తెచ్చారు. యింకా పూజ మొదలెట్టలేదనుకుంటా! యీ పని అయిపోతే నానింటికెళ్ళి మళ్లా వత్తానమ్మా! అన్నీ సర్దేసి అంట్లేసేత్తే కనీసం సాయంతరవన్నా ఎల్లి తొమ్మిది యినాయకుల్ని సూసొత్తా!" అంది లచ్చి పనిచేస్తూనే!

సునీత లచ్చికి యిచ్చేవి యిచ్చేసి, కాస్తంత ప్రసాదమూ, నాలుగు ఉండ్రాళ్లు పళ్లెంలో పెట్టి రమాదేవి వంటగది తలుపు తట్టింది.

మడిలో వున్న రమాదేవి తలుపు తెరిచి "అరె! అప్పుడే మీ పూజ అయిపోయిందా వదిన గారూ! మీ అన్నయ్యగారు ఇప్పుడే వచ్చారు బజారు నుంచి. నా వంట రెడీ అయిపోయిందనుకోండి! అరె! ప్రసాదమా! అక్కడ పెట్టండి. నేను యింకా దీపం పెట్టుకోలేదు." అంది.

"మా భోజనాలు కూడా అయిపోయాయి వదినగారు! పిల్లలు, ఆయన పది దాటితే అన్నానికాగలేరు. తెల్లారు జామున నాలుగింటికి లేస్తే యిపుడయ్యింది. "సరే! మీ పనిచేసుకోండి. వస్తాను." అంటూ తన వాటాలోకి వచ్చేసింది సునీత.

పిడిచిన బట్టలారేసి సునీత యిచ్చిన ప్రసాదం తీసుకుని యింటికి బయల్దేరింది లచ్చి.

* * *

భోజనానంతరం ఒక గంట నడుము వాల్చి అప్పుడే మెలకువ వచ్చిన సునీతకి పెరటి తలుపుమీద శబ్దం వినిపించడంతో తలుపుతీసింది. ఎదురుగా ప్రసాదం పళ్లెంతో రమాదేవి.

"కొబ్బరి లౌజుతో కజ్జికాయలు చేశాను. యిదే మొదటిసారి వదిన గారూ. ఎలా వున్నాయో ఏమిటో!" అంటూ పళ్లెం డైనింగ్ టేబిల్ మీద పెట్టింది చనువుగా లోపలికి వచ్చి రమాదేవి. మరీ గోలీకాయల్లా ఉన్నాయవి.

"మీరేంచేసినా సూక్ష్మంలో మోక్షం అన్నట్టు బలేగా చేస్తారొదిన గారూ. ఏమిటో నా చెయ్యి

# ఆడాళ్లూ మీకు జోహార్లు



కాకాని కమల

## మహిళా సైనికశక్తి



స్త్రీని ప్రశంసించటం అన్నది ఏదో లాంఛనంగా కానే కాదు. ఈ క్రింది సంఘటన చదివాక జోహార్ అనకుండా ఎవరూ ఉండలేరు. 'డేవిస్ క్రిస్టియన్'ది అంతటి సాహస గాథ. ఈమెని అందరూ 'మదర్ రాస్' అని పిలిచేవారు. ఈమె ఒక ఐరిష్ మహిళ సైనికురాలు. ఈమె ఎన్నో సంవత్సరాలు పురుషునిగా మారు వేషంలో సైన్యంలో పని చేసింది. ఆమె భర్త మార్క్ బోరోస్ అనే సైన్యంలో నిర్బంధ సైనికుడిగా ఉన్నాడు. అక్కడ ఆమె క్రిష్టోఫర్ వెల్స్ అనే పేరు మీద సైనికుడిగా చేరింది. 1704లో బ్లెన్ హేమ్ అనే యుద్ధంలోనూ, ఇతర యుద్ధాల్లోనూ పాల్గొంది. 1706లో తన భర్తని కలుసుకుంది. ఈమె చివరి రోజుల్లో వృద్ధ సైనికుల సేవలో తరించింది.

పురుషుని రూపంలో ఎన్నో సంవత్సరాలు సైన్యంలో- కొనసాగిన ఒక మహిళ విన్యాసాల జీవనగాథ ఇది. ☆

పెద్దది. చెయ్యి పట్టేటంత ఉంగ్రాళ్ళు చేస్తేకాని మావాళ్లు తిన్నట్టే ఫీలవరు. పొదుపు అనేది మీ నుంచే నేర్చుకోవాలి." అంది సునీత నవ్వుతూ.

లచ్చి ఎప్పుడొచ్చిందో ఏమో దూరంగా నిలబడి వారి మాటలు అయాక అంట్లు తీసుకుందామన్నట్టు ఎదురు చూడసాగింది.

"నిజమే వదిన గారు. మీలా మాదేమయినా యిద్దరి సంపాదనా? మీరూ, మీవారూ యిద్దరూ కష్టపడి సంపాదిస్తారు. కావలసినంత ఖర్చు చేస్తారు. అంతకు మించి పొదుపు చేస్తున్నారుగా!" అంది రమాదేవి.

"పొదుపా! అదేంలేదే!" ముఖం చిట్లించింది సునీత.

"నాకు చెప్పకండి వదిన గారూ! మీకు వచ్చే టపా నేనేగా యిచ్చేది. మీరు కట్టే చిట్ ఫండు నోటీసులు, ఎల్ ఐ సి ప్రీమియమ్‌లు అన్నీ కలిపి రిటైరైతే లక్షలే లక్షలు! మరి మేం దుబారా పేరుతో ఖర్చు పెట్టేసుకుంటే ఎవరిస్తారు చెప్పండి. ఆయనది ప్రవేటు ఫ్యాక్టరీలో ఉద్యోగం. జీతం ఎప్పుడిస్తారో ఆ ఫ్యాక్టరీ వాళ్లకే తెలీదు. పేరుకి యిద్దరమే గాని యింటికి పెద్దవాళ్లం కావడంతో వచ్చీపోయే కొంపాయె. మీలా కాదుగా!"

సునీతకి చిర్రెత్తుకొచ్చింది. అయినా నవ్వుతో కప్పేస్తూ అంది.

"మీకు పదిహేను ఎకరాల పొలముంది. ఉమ్మడి ఆస్తే అయినా ఆపంట డబ్బంతా వస్తుంది. ఎకరా మూడు లక్షలు చేసుకున్నా మీ వాటాకి అయిదు ఎకరాల క్రింద పదిహేను లక్షలు. మీది వార్షికాదాయం. మాది నెలసరి ఆదాయం. అంతే తేడా!"

"అయితే మాత్రం మాకన్నీ వ్యవసాయ అప్పులే కదండీ వదినగారూ. క్రిందటి సంవత్సరం వర్షాల్లేక పంటలు లేవు. రైతులకు తొమ్మిది గంటలు రోజుకు కరెంటు యిస్తానని ప్రభుత్వం ప్రకటించింది. ఏం చేయగలం చెప్పండి. వర్షాలు లేకపోతే వాళ్లు మాత్రం కరెంటు ఎక్కడనుండి సప్లయి చేస్తారు? విత్తనాలు, నారుమళ్లు, కూలీల రేట్లు, ఎరువులు, చీడపురుగులకు పిచికారీ మందులు వీటికి పెట్టే పెట్టుబడి రాబడికి సరిపోను తీసుకున్న అప్పులు తీర్చేసరికే తలప్రాణం తోకకొస్తుంది. చిన్నప్పుడు చదువు విలువ తెలీక చదువుకున్నాం కాదు. లేకుంటే మీలా దర్జాగా యిరవై వేలు సంపాదించేవాళ్లం. మరి అయిదెకరాల మీద సంవత్సరానికి రెండు లక్షల నలభై వేలు రాదుకదా! ఏమిటో మా తలరాత యిలా! మీ అదృష్టం అలా! వస్తాను వదినగారూ! మీ నిద్ర పాడుచేసినట్టున్నాను." నొక్కాల్సిన చోట సన్నాయి నొక్కులు నొక్కి వెళ్లిపోయిన రమాదేవి వెనుక మెటికలు విరిచింది సునీత.

"అలా దిక్కుమాలిన చూపులు చూస్తావేంటే లచ్చీ! వచ్చి సామాను తీసుకో!" అంది కోపంగా.

సునీత డైనింగ్ టేబిల్ ముందు కుర్చీలో కూలబడింది.

సామాను తీసుకుంటున్న లచ్చితో అంది.

"ఏయ్! ఇరవైనాలుగ్గంటలూ మా సంపాదన మీద పడి ఏడుస్తుందేమిటే దీని కళ్లు కాలిపోనూ. దీని నోట్లో పడ్డాక గత ఆరుమాసాలుగా చూస్తున్నావుగా యింటిల్లపాదికీ జ్వరాలు, రోగాలు, మందులూ! ఎంత డబ్బు మంచి నీళ్లలా ఖర్చు పెడుతున్నామో నీ కళ్లతో నువు చూస్తున్నావుగదా! యీయనొకరు ఆ వీధి గేటుకి ఓ లెటర్‌బాక్స్ బిగించండీ అంటే వినరు కదా! మా ఎల్.ఐ.సీలు, చీట్లు చూసి మాకు లక్షలు వస్తాయి అంటోంది. మరి మాకు తెలియకుండా యిదేం కూడబెడుతోందో మనకు తెలుసా! ఆ కొడుకులిద్దరూ ఉద్యోగాలంటుంది. ఏ ఉద్యోగాలో తెలీదు. ఎంత సంపాదిస్తారో తెలీదు. వాళ్ల యింటి మాట పూచిక పుల్లంత బయటకు రానీదు. మన వివరాలన్నీ కూపీల్లాగి పైగా మనపైపడి ఏడుపు. యిదుగో! ఆవిడ యిచ్చిన ఆ ప్రసాదం కూడా నీ కేరీజీలో సర్దేసుకో. మాకేం అక్కర్లేదు. గిల్లి జోలపాడటం అంటే యిదే కోబోలు. తీసేయ్. ముందు ఆ పళ్లెం టేబుల్ మీద నుంచి తీసెయ్. నాకు కంపరంగా వుంది." చిరాకుగా అంది సునీత.

"అది కాదమ్మా! ఆరు నాకు ఎడతారు కదమ్మా!" అనుమానంగా అంది లచ్చి.

"పెడితే అవి కూడా పట్టుకెళ్ళి మీ చుట్టుప్రక్కలవాళ్ళకి సంతర్పణ చేయి. ముందవి తీసి దాచుకుని ఆ పళ్లెం కడిగి వాళ్ళ గుమ్మంలో పెట్టు. లేకపోతే ప్రొద్దుటే లేచి ఆ పళ్లెం యివ్వడం కోసం దాని ముఖం చూడాలి. లచ్చి సామాను తీసుకుని వెళ్ళిపోయిన తరువాత తలుపువేసివచ్చి మంచం మీద పడుకుని లోకం తీరు గురించి ఆలోచించసాగింది సునీత.

* * *


లచ్చి, సునీత సామాను తోమేసి రమాదేవి తలుపు తట్టబోతుండగానే రమాదేవి తలుపు తీసింది.

"అమ్మయ్య! యిప్పటికైంది. లచ్చీ! యిదుగో నీకు ప్రసాదం! తీసుకో!" అంటూ లచ్చికివాల్సినవన్నీ యిచ్చింది. తర్వాత సామాను సర్ది అంట్లు వేసింది. లచ్చి అవి తీసుకువెళ్లబోతుంటే ఆగమన్నట్టు చేత్తో సైగచేసి అటూ యిటూ చూసి గొంతు తగ్గించి అంది.

"ఏమే లచ్చీ! యిందాక నేను గద్దెట్టాక ఆ



# క్రిమినల్‌కేసు ఉన్నప్పుడు పాస్‌పోర్టు ఈయవచ్చా?




ఆయన ఛార్టర్డ్ ఎకౌంటెంట్. పాస్‌పోర్ట్‌కి అర్జీ దాఖలు చేశాడు. ఈయనపై మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ కేసులు వేయబడ్డాయి. ఆ కేసుల్లో కోర్టు తీర్పుల కాపీలను పంపవలసినదిగా, పాస్‌పోర్టు అధికారి, ఈయనను అడిగారు. కేసులు పెండింగు ఉన్నవి. తీర్పులు రాలేదు. ఇదీ పరిస్థితి. ఏదిఏమైనా, క్రిమినల్ కేసులు విచారణలో ఉన్నవి. అందుచేత పాస్‌పోర్టు ఈయలేము అన్నారు అధికారులు. ఈ కేసులు తేలాలంటే చాలాకాలం పడుతుంది. వ్యాపారం గురించి విదేశాలకు వెళ్ళాలి. పాస్‌పోర్టు ఈయమంటే ఎట్లా? ఈ విధమైన వాదోపవాదాలు నడిచాయి గుజరాత్ హైకోర్టులో.

ముంబాయ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు (ఏఐఆర్ 1997 ముంబాయ్ 181) గుజరాత్ హైకోర్టులో చూపబడింది. 25-8-1993న కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషను ఒకటి వున్నదట. అదికూడా గుజరాత్ హైకోర్టు దృష్టికి తీసుకురాబడింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం, కోర్టులో క్రిమినల్ కేసులో వున్న వ్యక్తి, కోర్టు ఆర్డరును పొందిన, అతనికి పాస్‌పోర్టు ఈయవచ్చు. కొన్ని నిబంధనలు ఉన్నవి ఈ నోటిఫికేషనులో. అవి అన్నీ ఇక్కడ రాయలేదు.

నోటిఫికేషను దృష్ట్యా, అధికారులు పాస్‌పోర్టు అర్జీలను మెకానికల్‌గా తిరస్కరించ గూడదు. ఈ విషయం అర్జీదారుని దృష్టికి తీసుకురావాలి. ఇటువంటి నోటిఫికేషన్ ఉన్న విషయం పాస్‌పోర్టు అధికారికి తెలుసా, తెలియదా అనే అనుమానం కూడా కలుగుతున్నది అని గుజరాత్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ రకమైన అభ్యంతరాలు ఉన్నప్పుడు, పాస్‌పోర్టు అధికారి, ఈ నోటిఫికేషన్ గురించి అర్జీదారునికి తెలపాలి. అర్జీదారుడు, నోటిఫికేషన్ కాపీ కావాలంటే, ఛార్జి వసూలుచేసి, దానిని అతనికి ఇవ్వాలి. అని కూడా అన్నది గుజరాత్ హైకోర్టు. అట్లా చేసినట్లయితే, అర్జీదారుడు, క్రిమినల్ కోర్టును, అనుమతికోసం అర్థించవచ్చు. అనుమతి ఇవ్వాలా వద్దా (విదేశాలకు వెళ్లడానికి) అనేది కోర్టు నిర్ణయిస్తుంది. ఈ కేసులోని ఛార్టెర్డ్ ఎకౌంటెంటును, క్రిమినల్ కోర్టు అనుమతి కోసం అర్జీ చేసుకోమన్నది గుజరాత్ హైకోర్టు.

ఈ తీర్పువల్ల తెలిసింది ఏమంటే, క్రిమినల్ కేసు వున్నంతమాత్రాన పాస్‌పోర్టు నిరాకరించ రాదు. కోర్టులో అనుమతికోసం కోరవచ్చు. కోర్టు అనుమతిస్తే పాస్‌పోర్టు ఈయవచ్చు అని. (ఎ.ఐ.ఆర్. 2003 గుజరాత్ 108)

✻

సునీత నీదగ్గర ఏమైనా నాగురించి వాగిందా?"

"అబ్బే లేదమ్మా! అసలు మీ వూసే ఎత్తలేదు." అంది లచ్చి, రమాదేవి అడిగినంత నెమ్మదిగా సమాధానమిస్తూ.

" నోరుముయ్యవే. నేను నానా మాటలు అంటూ ఉంటే దాని ముఖం మాడ్చుకోవడం నేను చూడలేదనుకున్నావా! నేను నిన్ను ఏమైనా అంటానేమోనని భయపడ్తున్నావా? ఏమీ అనుకోనులే నిజం చెప్పు!"

"నిజంగానమ్మా! ఆయమ్మ మిమ్మల్నేమీ అనలేదు."

"నీకు ఆవిడంటే అభిమానమే. నాతో నిజం ఎందుకు చెబుతావూ?"

"మీకు నా మాటమీద నమ్మకం లేకపోతే నేనేం చేయలేనమ్మా! మరి ఆ యింట్లో పని మానేయమంటారా?"

"వద్దులే నీ కడుపుకొట్టడం నా ఉద్దేశ్యం కాదు గానీ, నా గురించి ఏమైనా వాగిందేమో తెలుసుకుందామని అడిగాను. యిరవైనాలుగ్గంటలూ నా పొలం గురించే దానేడుపు. నా యింటి గుట్టు మట్లన్నీ దానికి కావాలి. మళ్ళీ నోరెత్తకుండా గడ్డెట్టాను. అది సరేగానీ దాని ప్రసాదం మా యింట్లో ఎవరూ తినరు. నీకు యిస్తాను. అలా వీధివైపుకురా!" అంటూ ఆ ప్రసాదం పళ్ళెం తీసుకుని వీధి తలుపువైపు వెళ్లింది రమాదేవి. నుదురుకొట్టుకుని వీధివైపు నడిచింది లచ్చి.

* * *

"ఏందేవ్? ఈ యాల ఒద్దె ఒద్దె ఎట్టేతన్నావు? ఎక్కడియి యియ్యన్నీ!" అడిగాడు నాంచారి, లచ్చిని.

"అదేంది మావా అట్టడుగుతావ్? నేను పనిసేత్తన్న అమ్మగార్లిద్దరూ ఎట్టిన్రు. ఎట్టున్నాయి?" అంది భర్తకి మరో రెండు ఉండ్రాళ్ళు వేస్తూ.

"యింక సాల్లేవే. దాచి ఆనక పిలగాల్లకెట్టు. సానా బాగున్నాయి. డబ్బుంటే ఎన్ని రకాలయినా సేసుకు తినచ్చు. అద్సరేగానీ వండినదంతా మనకే ఎట్టేశారా ఏటి?"

"లేదు మావా! ఈ అమ్మని సూత్తే ఆ అమ్మ కుళ్ళుకుంటది. ఆయమ్మని సూత్తే యీ అమ్మ కళ్లలో నిప్పులేసుకుంటది. బాకుల్తో పొడిచేసుకునేలా మాట్లాడుకుంటూనే సూపుల్తో సీరేసుకుంటారు. మామూలుగా మనకిచ్చేవి మనకివ్వగా ఆయమ్మ ఈ యమ్మ కిచ్చినవి, ఈ యమ్మ ఆయమ్మకిచ్చినవీ కూడా నాకే యిచ్చిన్రు. అదీ సంగతి!"

"చూడు ఎర్రిమొగవా! అలా నీకు వెట్టి ఆళ్ల యిసయాలు ఈవిడ, ఈవిడ యిసయాలు ఆవిడ అడుకుతుంటారు. అక్కడవక్కడ, యిక్కడ విక్కడ సెప్పమాక. ఆళ్ళిచ్చే పైసలే మనకు సీటీ కట్టడానికి ఆధారం. ఈ మధ్యతరగతోళ్ళంత అసంతృప్తి బతుకులు మరెవరికీ వుండవు. పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందని మా టీచరు గారు సెప్పేవారు. మనకు కావలసింది డబ్బు. సివరకు ఆళ్ళు ఆళ్ళు తిట్టుకుని అంతా నువే అన్నావని నీ మీద ఎట్టిపని మానిపించ గల్రు. జాగత్త."

"నువు సెప్పినట్టే జరుగుతోంది మావా యిపుడు. అందుకే సెవిటిదానిలా యినేసి వూరకుంతన్నాను. ఏమీ జవాబు సెప్పట్లేదు." అంది లచ్చి మెచ్చుకోలుగా భర్తను చూస్తూ.

"ఆ బతుకు తెరువే మనం నేర్చుకోవాల. వచ్చిన డబ్బుతో సంతృప్తిగా బతకగలం మనం. ఆళ్ళులేని దానికోసం ఎగబడి, ఎదుటి ఆళ్ళకుందని ఏడ్చి అన్నీఉన్నా ఏమీలేనట్టు బతుకుతారు. నీ జాగర్తలో నువ్వుండు. అదే నేను సెప్పేది!" అన్నాడు నాంచారి హెచ్చరిస్తున్నట్టు.

"అట్టాగే మావా! నా వల్ల ఏ తప్పు లేకుండా సూసుకుంటాను." అంది లచ్చి సంతృప్తినిండిన మనసుతో!

✻